క్లుప్తంగా

ఆన్‌లైన్‌లో సొమ్ము స్వాహా

పట్నంబజారు: ఆన్‌లైన్‌లో మోసం చేసి నగదు దోచుకున్న ఘటనపై కేసు నమోదైంది. లాలాపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చౌత్రా సెంటర్‌కు చెందిన అన్నవరపు పవన్‌కుమార్ సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పని చేస్తున్నారు. ఈనెల 11న టెలిగ్రామ్ యాప్‌లో స్టాక్ మార్కెట్ ఇన్వెస్ట్‌మెంట్‌కు సంబంధించి యాప్‌ను ఓపెన్ చేశారు. వారు సూచించిన విధంగా పెట్టుబడి పెడితే లాభం వస్తుందని నమ్మబలికిన నేపథ్యంలో రూ. 2.38 లక్షలు చెల్లించారు. సదరు యాప్‌కు సంబంధించిన వ్యక్తులు స్పందించకపోవడంతో మోసపోయినట్లు గుర్తించి బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

స్కేటింగ్‌లో చిన్నారి సోఫియా ప్రతిభ



గుంటూరు ఎడ్యుకేషన్: ఎల్‌ఐసీ కాలనీలోని విజ్ఞాన్ పాఠశాలలో 3వ తరగతి చదువుతున్న చిన్నారి నెలటూరి సోఫియా స్కేటింగ్‌లో ఉత్తమ ప్రతిభ కనబరుస్తూ పతకాలు సాధిస్తున్నట్లు ప్రిన్సిపాల్ శ్రీనివాస్ బుధవారం తెలిపారు. రాష్ట్ర, జిల్లాస్థాయిల్లో జరిగిన స్కేటింగ్ పోటీల్లో బంగారు, వెండి పతకాలు సాధించినట్లు ఆయన పేర్కొన్నారు. సోఫియా తండ్రి రవి కుమార్ రన్నింగ్ అథ్లెటిక్‌గా ఉన్నారని, కూతురులోని ప్రతిభను ఆయన గుర్తించి మంచి శిక్షణ ఇప్పించడంతో నేడు పతకాలు సాధించిందని వివరించారు. భవిష్యత్తులో మరిన్ని పతకాలు సాధించి దేశస్థాయిలో సోఫియా ఖ్యాతిని సాధించాలని ప్రిన్సిపాల్ ఆకాంక్షించారు. విద్యార్థులు క్రీడలతో పాటుగా అన్ని రంగాల్లో చిన్ననాటి నుండి రాణించాలని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా సోఫియాకు విజ్ఞాన్ సంస్థల అధినేత డాక్టర్ లావు రత్తయ్య, ఉపాధ్యక్షుడు, నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు అభినందనలు తెలిపారు.

సవాళ్లను అధిగమించాలి

పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ చీఫ్ జనరల్ మేనేజర్ బీఎం. పట్నాయక్



చేబ్రోలు : దేశ పురోగతికి ఆటంకం కలిగించే సవాళ్లను అధిగమించి అభివృద్ధి వైపు పయనించాలని పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ చీఫ్ జనరల్ మేనేజర్ బి.ఎం. పట్నాయక్ అన్నారు. చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో ద రోల్ ఆఫ్ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ – ద జర్నీ అండ్ ఫ్యూచర్ ఎక్స్‌పెక్టేషన్స్ ఫర్ వికాసిత్ భారత్- 2047 అనే అంశంపై బుధవారం ప్రత్యేక అతిథిగా ఆయన మాట్లాడారు. 2047 నాటికి భారతదేశం ఆర్థికవృద్ధి, సామాజిక, సాంకేతిక పురోగతి, స్థిరమైన అభివృద్ధి కోసం స్పష్టమైన లక్ష్యాలను నిర్దేశించడం ద్వారా యువత చురుకుగా పాల్గొనడానికి రోడ్ మ్యాప్‌ను ఏర్పాటు చేసుకోవాలన్నారు. నాణ్యమైన విద్య, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు, వృత్తి శిక్షణకు ప్రాధాన్యమివ్వాలని తెలిపారు. ఒక దేశం అవినీతి రహితంగా, అందమైన మనస్సులతో కూడిన విధంగా మారాలంటే తల్లి, తండ్రి, గురువు అనే ముగ్గురు కీలకమైన సభ్యులతో సమాజంలో మార్పును తీసుకురావచ్చని సూచించారు.

21న విద్యుత్ అదాలత్

పొన్నూరు: విద్యుత్ వినియోగదారుల ఫోరం (సీజీఆర్ఎఫ్) విజయవాడ ఆధ్వర్యంలో శనివారం విద్యుత్ అదాలత్, అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు బాపట్ల ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జి.ఆంజనేయులు బుధవారం ప్రకటనలో తెలిపారు. పొన్నూరులోని డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ విద్యుత్ కార్యాలయ ప్రాంగణంలో ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు నిర్వహించనున్న సదస్సులో సీజీఆర్ఎఫ్ చైర్మన్ జస్టిస్ ఎన్. విక్టర్ ఇమ్మానుయేల్, ఫోరం సభ్యులు, సూపరింటెండింగ్ ఇంజనీర్, గుంటూరు విద్యుత్ అధికారులు పాల్గొంటారని పేర్కొన్నారు.

బాక్సింగ్‌లో హనోక్‌కు బంగారు పతకం



గుంటూరు రూరల్: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని గుంటూరు ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ కోయి సుబ్బారావు తెలిపారు. కళాశాలలో పాలిటెక్నిక్ మొదటి సంవత్సరం విద్యార్థి కూచిపూడి హనోక్ విజయవాడ లయోలా కళాశాలలో జరిగిన జిల్లాస్థాయి ఎస్‌జీఎఫ్ పోటీల్లో అండర్- 17 (45-50 కేజీల) విభాగంలో బంగారు పతకం సాధించాడు. ఈ సందర్భంగా బుధవారం ప్రత్తిపాడు మండలం యనమదలలోని కళాశాలలో ఏర్పాటు చేసిన విద్యార్థి అభినందన కార్యక్రమంలో చైర్మన్ కోయి సుబ్బారావు మాట్లాడుతూ క్రీడల్లో రాణించడం వల్ల ఉపాధి అవకాశాలు సత్వరం లభిస్తాయని తెలిపారు.

సిరులిచ్చే శ్రీ మహాలక్ష్మి.. నమోస్తుతే !



సంపత్‌నగర్ శ్రీ శారద పరమేశ్వరి దేవస్థానంలో మయూర వాహన అలంకారం



ఏటీ అగ్రహారం గాయత్రి మందిరంలో రూ. 36 లక్షలతో ధనలక్ష్మిగా అలంకారం



చెట్టు వీధిలోని శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో పుష్పశయ్య అలంకారంలో..



బృందావన్ గార్డెన్స్ శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో అన్నపూర్ణా దేవిగా..



ఆర్. అగ్రహారం శ్రీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో పుష్పశయ్య అలంకారంలో..



అరండల్ పేట శ్రీ అష్టలక్ష్మి దేవాలయంలో మహాలక్ష్మి దేవిగా..



మల్లారెడ్డినగర్ శ్రీ అయ్యప్పస్వామి దేవాలయంలో మహాలక్ష్మి దేవిగా..



విద్యానగర్ శ్రీ సాయినాథ సన్నిధానంలో మహాలక్ష్మి దేవిగా..



అరండల్ పేట శివాలయంలో రాజరాజేశ్వరి దేవిగా..



రవీంద్రనగర్ కాళీ పీఠంలో హోమం చేస్తున్న నరసింహానంద భారతీస్వామి



సంపత్‌నగర్ శ్రీ శారద పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో నృత్య ప్రదర్శన

నగరంలో శ్రీ దేవీ శరన్నవరాత్రుల మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. కార్యక్రమంలో భాగంగా నాలుగో రోజు అమ్మవారిని విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు ఆలయాల్లోని క్యూలైన్లలో బారులు తీరారు. సామూహిక కుంకుమార్చనలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఏర్పాట్లను ఆలయ, ఉత్సవ కమిటీలు పర్యవేక్షించారు.

–పాత గుంటూరు

అంకితభావమే విజయానికి బలమైన పునాది

వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్యవరప్రసాద్

నెహ్రూనగర్: క్రీడలపై అంకితభావమే విజయానికి బలమైన పునాది అని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ పేర్కొన్నారు. నరసరావుపేట కస్తూరిబా బాలికల పాఠశాలలో ఉపాధ్యాయినిగా పనిచేస్తున్న వి.విజయ ఇటీవల మలేషియాలో జరిగిన అంతర్జాతీయ అథ్లెటిక్స్ ఓపెన్ మీట్‌లో దేశం తరఫున 1500 మీటర్ల పరుగు పందెంలో పాల్గొని సిల్వర్ మెడల్ సాధించారు. ఈ సందర్భంగా ఆమెను బుధవారం వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ అధ్యాపక విభాగం రాష్ట్ర అధ్యక్షుడు మాదిరెడ్డి శ్రీనివాసరెడ్డి,



విజయను సన్మానిస్తున్న వైఎస్సార్ సీపీ మహిళా నేతలు

గనిక ఝాన్సీ, విజయమాధవి, వైఎస్సార్ సీపీ డాక్టర్స్ విభాగం అధ్యక్షుడు డాక్టర్ వై. షేక్, ఉపాధ్యాయ నేతలు డాక్టర్ పి.ముత్యం, రాధాస్వామిరెడ్డి, విశ్వరూపాచారి, పిన్నింటి శివబాబు, ముత్యాలరాజు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

విజ్ఞానాభివృద్ధితోనే జీవితంలో ఉన్నత స్థానం

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థులు తమలోని శక్తి, సామర్థ్యాల్ని గుర్తించి విజ్ఞానాన్ని అభివృద్ధి పరచుకోవడం ద్వారా జీవితంలో ఉన్నతస్థాయికి చేరుకోగలరని హెచ్‌ఆర్ ఫుట్ ప్రింట్ సీఈవో డాక్టర్ జి. రాజ్‌కుమార్ పేర్కొన్నారు. అమరావతి రోడ్డులోని హిందూ మేనేజ్‌మెంట్ కళాశాలలో బుధవారం ఎంబీఏ, ఎంబీఏ హాస్పిటల్ మేనేజ్‌మెంట్ ప్రథమ సంవత్సర విద్యార్థులకు నిర్వహించిన పాఠ్యాంశాల పరిచయ తరగతులు ముగిశాయి. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథి పాల్గొన్న రాజ్‌కుమార్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి గురువులు చెప్పే విషయాల్ని శ్రద్ధగా ఆలకించాలని సూచించారు. విజ్ఞానాభివృద్ధికి దోహదం చేసే విషయాలను ఆకళింపు చేసుకోవాలని చెప్పారు. తొందరపాటుతో కాకుండా వివేకంతో ఆలోచించి నిర్ణయాలు తీసుకోవాలని తెలిపారు. కార్పొరేట్ రంగంలో నేర్చుకోవడమనేది ఉద్యోగి బాధ్యతని, అదే విద్యార్థి



డాక్టర్ రాజ్‌కుమార్

దశలో అయితే ఆచార్యుల ద్వారా సందేహాల్ని నివృత్తి చేసుకోవాలని సూచించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్వీ రమణ మాట్లాడుతూ విద్యార్థులకు పాఠ్యాంశాలను పరిచయం చేసే స్వల్పకాలిక తరగతుల్లో పరిశ్రమల అవసరాలకు దీటుగా తీర్చిదిద్దే విధానంపై అధ్యాపకులు బోధన సాగించారని చెప్పారు. వెలగపూడి ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు వెలగపూడి కృష్ణకుమారి, ఏఎన్‌యూ సైకాలజీ ప్రొఫెసర్ టీడీ విమల శిక్షణ తరగతుల్ని నిర్వహించినట్లు వివరించారు. కార్యక్రమంలో ఎస్వీఎస్ లక్ష్మీ నారాయణ, ఎంబీఏ విభాగాధిపతి వి. చక్రవర్తి, ప్రొఫెసర్ కె. లలిత, సహ ఆచార్యులు డి. కల్యాణి, సీహెచ్. వైష్ణవి, సీహెచ్. వేదవతి, అనిత, ఏ. బాజీ బాబు, అభిలాష్, ఎన్. మణికంత పాల్గొన్నారు.

కిట్స్‌లో విద్యార్థుల అమృత కలశ యాత్ర

గుంటూరు రూరల్: ప్రతి ఒక్కరూ దేశభక్తిని పెంపొందించుకోవాలని నెహ్రూ యువ కేంద్రం డిస్ట్రిక్ యూత్ ఆఫీసర్ కిరణ్మయి దేవిరెడ్డి తెలిపారు. వట్టిచెరుకూరు మండలం వింజనంపాడులోని కిట్స్ కళాశాలలో బుధవారం భారత ప్రభుత్వ యువజన వ్యవహారాల క్రీడా మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు అమృత కలశ్ యాత్రను నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థుల ద్వారా మట్టిని, ధాన్యాన్ని సేకరించి కాకినాడ జేఎన్‌టీయూ ఎన్ఎస్ఎస్ యూనిట్ ద్వారా భారత ప్రభుత్వ యువజన క్రీడా మంత్రిత్వ శాఖకు అందించనున్నట్లు చెప్పారు. న్యూఢిల్లీలో అక్టోబర్ నెల చివరి వారంలో స్వామి వివేకానంద విగ్రహం వద్ద సేకరించిన మట్టిని, బియ్యాన్ని సమర్పించనున్నట్లు తెలిపారు. అనంతరం పంచప్రాణ ప్రతిజ్ఞను నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా బ్యాంక్ లీడ్



అమృత కలశయాత్రను నిర్వహిస్తున్న నెహ్రూ యువ కేంద్రం అధికారి కిరణ్మయి దేవిరెడ్డి తదితరులు

మేనేజర్ మణిపాల్‌రెడ్డి, కళాశాల చైర్మన్ కోయి సుబ్బారావు, కార్యదర్శి కోయి శేఖర్, ప్రిన్సిపాల్ డాక్టర్ పి.బాబు, డైరెక్టర్ డాక్టర్ కె. హరిబాబు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ కె. చంద్రారెడ్డి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరికి గాయాలు

చేబ్రోలు: ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించే ప్రయత్నంలో ద్విచక్ర వాహనం అదుపుతప్పి ప్రమాదానికి గురవటంతో యువకుడికి గాయాలైన సంఘటన చేబ్రోలు మండలం వడ్లమూడి గ్రామ పరిధిలో బుధవారం జరిగింది. మండల పరిధిలోని గొడవర్రు గ్రామానికి చెందిన బి. జోజి పనుల నిమిత్తం తెనాలి వెళ్లి బైక్‌పై తిరిగి స్వగ్రామానికి వస్తున్న సమయంలో వడ్లమూడి క్వారీ బ్రిక్స్ పరిశ్రమ ఎదురుగా బైక్ అదుపు తప్పి ప్రమాదానికి గురైంది. తలకు, కాళ్లు, చేతులకు గాయాలైన జోజిని 108 ద్వారా గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

సెయింట్ మేరీస్ విద్యార్థికి గాయాలు

నారాకోడూరు గ్రామ శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో సెయింట్ మేరీస్ ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన విద్యార్థికి బుధవారం గాయాలయ్యాయి. విజయవాడకు చెందిన కిరణ్ తేజ బైక్‌పై వస్తుండగా అదుపుతప్పి పంట కాలువలో దూసుకుపోయింది. కాలు విరిగిన కిరణ్‌తేజను 108 వాహనం ద్వారా గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

పోలీసు అమరవీరుల సంస్మరణ సభకు ఆహ్వానం

తాడేపల్లిరూరల్: వీరమరణం పొందిన పోలీసు కుటుంబాన్ని పోలీసు అమరవీరుల సంస్మరణ సభకు రావాలని కోరుతూ కాకినాడ మూడో బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ జేఎన్‌వీ సత్యనారాయణ ఆహ్వానం పలికారు. తాడేపల్లికి చెందిన వి.శంకరరావు, కాకినాడ మూడో బెటాలియన్‌లో ఏపీఎస్‌పీ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. విధుల్లో ఉండగా 1992లో నక్సలైట్లు పేల్చిన బాంబుదాడిలో ప్రాణాలు కోల్పోయాడు. ఈనెల 21వ తేదీన పోలీసు అమరవీరుల దినోత్సవం నేపథ్యంలో కాకినాడ ఏపిఎస్‌పి 3వ బెటాలియన్ కమాండెంట్ సీహెచ్. విజయరావు ఆదేశాల మేరకు బుధవారం బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ సత్యనారాయణ తాడేపల్లి చేరుకుని శంకరరావు భార్యకు పండ్లు, పుష్పగుచ్ఛం అందజేసి ఆహ్వానం పలికారు.

భర్త ఆత్మహత్యపై పోలీసులకు ఫిర్యాదు

గుంటూరు రూరల్: భర్త ఆత్మహత్యపై భార్య నల్లపాడు పోలీసులకు ఫిర్యాదు చేసింది. సీఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం.. కొరిటెపాడు జీరో లైనులో రామానందం శివప్రసాద్ (40) భార్య శాంతితో కలసి నివాసం ఉంటున్నాడు. అతడు పలు బ్యాంకుల్లో రుణాలు ఇప్పిస్తూ ఉంటాడు. పలువురికి ష్యూరిటీ కూడా ఉన్నాడు. వారు నెలనెలా కిస్తీలు చెల్లించకపోవడంతో షూరిటీగా ఉన్న శివప్రసాద్‌కు బ్యాంకు అధికారులు నోటీసులు పంపించారు. రుణాలు తీసుకున్నవారిని చెల్లించాలని చెప్పినప్పటికీ వారు పట్టించుకోకపోవడంతో అప్పు ఇచ్చిన వారి నుంచి శివప్రసాద్‌కు ఒత్తిడి పెరిగింది. దీంతో ఇటీవల జేకేసీ కాలేజీ రోడ్డులో పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు అతడ్ని గుర్తించి చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. చికిత్స పొందుతున్న సమయంలో తాను ఆత్మహత్య చేసుకోవడానికి కారణం ముళ్లమూడి కిరణ్‌కుమార్, శానం గోపాలకృష్ణ, దర్శనపు అశోక్ అని వీడియో రికార్డ్ చేశాడు. దీనిపై భార్య శాంతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి ఆత్మహత్యకు కారణమైన నిందితుల్ని వీలైనంత త్వరలో అరెస్టు చేస్తామని, కేసు దర్యాప్తులో ఉన్నట్లు సీఐ శ్రీనివాసరావు తెలిపారు.

జగనన్న ఆరోగ్య సురక్షకు విశేష స్పందన



శిబిరంలో కార్డును అందజేస్తున్న నూరిఫాతిమా



శిబిరానికి వచ్చిన ప్రజలతో మాట్లాడుతున్న షేక్ సజిల

పట్నంబజారు: రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "జగనన్న ఆరోగ్య సురక్ష" కార్యక్రమానికి అన్ని వర్గాల ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ నూరి ఫాతిమా చెప్పారు. ఆమె బుధవారం 15, 17, 53, 56 డివిజన్లలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో సైతం విలేజ్ హెల్త్ క్లినిక్‌లు, ఫ్యామిలీ డాక్టర్ వంటి విప్లవాత్మక కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందని తెలిపారు. కార్పొరేట్ ఆసుపత్రులకు వెళ్లి వైద్యం చేయించుకోలేని పేదలకు తానున్నానే భరోసాని కల్పిస్తూ... ఆరోగ్యశ్రీ అందుబాటులోకి తీసుకునివచ్చారని పేర్కొన్నారు. ఆరోగ్య సురక్ష పేదలకు వరంలా మారిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు రామబోయిన అజయ్‌యాదవ్, అయిశెట్టి కనకదుర్గ, ఫర్జాన, దూపాటి వంశీ, వైఎస్సార్ సీపీ నేతలు అయిశెట్టి శ్రీనివాసరావు, దూపాటి సాల్మన్, రాజేష్, అగ్గిపెట్టె రాజు, భాస్కర్, మున్నిసా, చిన్న, రాము, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రజలకు వరం జగనన్న ఆరోగ్య సురక్ష

పట్నంబజారు: గుంటూరు తూర్పు నియోజకవర్గంలోని తొమ్మిదో డివిజన్ పాత గుంటూరు శ్రీకృష్ణ కల్యాణ మండపంలో బుధవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో నగర డెప్యూటీ మేయర్ షేక్ సజిల పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యంపై సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారని తెలిపారు. వైద్యం కోసం ఇబ్బంది పడకుండా పూర్తి స్థాయిలో చర్యలు చేపడుతున్నారని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు షేక్ షౌకత్, రాచమంటి భాస్కర్ పాల్గొన్నారు.

స్వాతంత్య్ర సమరయోధుల త్యాగాలు చిరస్మరణీయం

నెహ్రూనగర్: స్వాతంత్య్ర సమరయోధుల త్యాగాలు చిరస్మరణీయమని గుంటూరు జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ మణిపాల్‌రెడ్డి పేర్కొన్నారు. నెహ్రూ యువ కేంద్ర సంఘటన్ ఆధ్వర్యంలో బుధవారం ఉమెన్స్ కాలేజీలో మేరీ మాటి- మేరే దేశ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కాలేజీలో మట్టిని సేకరించి, కుండల్లో భద్రపరిచారు. ఈ సందర్భంగా మణిపాల్‌రెడ్డి మాట్లాడుతూ ఇంటింటికీ వెళ్లి సేకరించిన బియ్యం, మట్టిని ఢిల్లీలో అక్టోబర్ నెల చివరి వారంలో నిర్వహించబోయే జాతీయ స్థాయి కార్యక్రమంలో స్వామి వివేకానంద విగ్రహం వద్ద సమర్పించనున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో నెహ్రూ



కాలేజీలోని మట్టిని కుండల్లో సేకరిస్తున్న అధ్యాపకులు

యువ కేంద్ర సంఘటన్ జిల్లా కో–ఆర్డినేటర్ కిరణ్మయి దేవిరెడ్డి, ఉమెన్స్ కాలేజీ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ సంతోషకుమారి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

యుద్ధం తక్షణమే ఆగేలా ప్రయత్నించాలి

లక్ష్మీపురం: ఇజ్రాయిల్- హమాస్ మధ్య యుద్ధం తక్షణమే ఆగేలా ప్రపంచ దేశాలన్నీ ప్రయత్నించాలని విశ్రాంత ప్రిన్సిపాల్ ఎస్.రవిబాబు కోరారు. బాధితుల కనీస అవసరాలను కూడా పట్టించుకోకుండా, అంతర్జాతీయ మానవతావాద చట్టానికి నీళ్లోదిలేస్తున్న ఇజ్రాయిల్- హమాస్ యుద్ధం చివరికి మానవ సంక్షోభంగా మారిన పరిస్థితులు కన్పిస్తున్నాయని తెలిపారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో కార్యదర్శి కొండా శివరామిరెడ్డి ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇజ్రాయిల్‌పై అక్టోబర్ 7న పాలస్తీనా ప్రాంత తీవ్రవాద గ్రూపు హమాస్ జరిపిన దాడి తాలూకు ప్రకంపనలు ఆగేలా లేవని ఆందోళన వ్యక్తం చేశారు. హమాస్‌ను తుద ముట్టిస్తామంటూ గాజాపై ఇజ్రాయిల్ జరుపుతున్న దాడి అంతకంతకు తీవ్రమవుతోందని తెలిపారు. ఇజ్రాయిల్ భూతల దాడులకు దిగడానికి సన్నద్ధమైందని, ఇప్పటికే గాజాను



మాట్లాడుతున్న విశ్రాంత ప్రిన్సిపాల్ రవిబాబు

అష్టదిగ్బంధనం చేయడంతో అక్కడి పాలస్తీనీయన్లకు తినటానికి తిండి, తాగడానికి నీళ్లు లేని పరిస్థితి నెలకొందని పేర్కొన్నారు. సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, విశ్లేషకులు ఆర్.వి. సింగరయ్య మాట్లాడుతూ ప్రపంచ దేశాలు రెండు వర్గాలుగా చీలిపోయి మాట్లాడటం దురదృష్టకమని ఖండించారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు, సీనియర్ సిటిజన్స్, పెన్షనర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

అంతరిక్ష పరిశోధనల్లో ఇస్రో కీర్తి విశ్వవ్యాప్తం



కార్యక్రమంలో మాట్లాడుతున్న శాస్త్రవేత్త జగన్మోహనరావు

గుంటూరు రూరల్: అంతరిక్ష పరిశోధనల్లో ఇస్రో కీర్తి విశ్వవ్యాప్తంగా చాటుకుందని ఇస్రో మాస్టర్ కంట్రోల్ ఫెసిలిటీ విభాగం సైంటిస్ట్ జి. జగన్మోహనరావు పేర్కొన్నారు. చౌడవరంలోని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం నిర్వహించిన ఇండియన్ స్పేస్ ప్రోగ్రాం ప్రజెంట్ ఫ్యూచర్ అనే అంశంపై నిర్వహించిన సెమినార్‌లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇస్రోలో సేవలందించేందుకు విద్యార్థులు శాస్త్రవేత్తలుగా తయారయ్యే దిశగా కృషి చేయాలని తెలిపారు. భారతదేశంలో వివిధ ప్రాంతాల్లో నెలకొల్పిన కేంద్రాల్లో ఇస్రో పరిశోధనలు, శాటిలైట్స్ ప్రయోగాలు పనితీరు, వాటి వల్ల కలిగే ప్రయోజనాలను విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు శాస్త్రవేత్తలు గా తయారయ్యేందుకు అనుసరించాల్సిన విద్యావిధానాన్ని ఆయన తెలియజేశారు. దేశాభివృద్ధే లక్ష్యంగా అంతరిక్ష విజ్ఞానాన్ని అభివృద్ధి చేసే ఉద్దేశంతో ఏర్పాటైన ఇస్రో అనేక పరిశోధనల్లో విప్లవాత్మక విజయాలను సాధించిందని పేర్కొన్నారు. ప్రపంచంలోని అగ్రగామి అంతరిక్ష రంగ సంస్థల్లో ఒకటిగా పేరుగాంచినదని తెలిపారు. భవిష్యత్‌లో జరుపనున్న గగన్‌యాన్, చంద్రయాన్- 4, లుపెక్స్, శుక్రయాన్, మంగళ్యాన్- 2, ఎక్స్‌పో సట్, నిస్సార్, స్పాడెక్స్ తదితర ఉపగ్రహ ప్రయోగాల విజయాలే ఇస్రో ముందున్న తదుపరి లక్ష్యమని ఆయన తెలిపారు.

అమెరికా, రష్యా దేశాల నుంచి దిగుమతి చేసుకున్న రాకెట్లను ప్రయోగించే స్థాయి నుంచి అనతికాలంలోనే భారతదేశం స్వదేశీయంగా పూర్తిస్థాయిలో తయారు చేసి, ఉపరితల అధ్యయనంలో పురోగతి సాధించడం గర్వకారణమని కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్. శ్రీనివాస్, సెక్రటరీ కరస్పాండెంట్ ఆర్. గోపాలకృష్ణ తెలిపారు.శాస్త్రవేత్తగా ఇస్రోలో సేవలందిస్తున్న జగన్మోహన్‌రావు తమ కళాశాల పూర్వ విద్యార్థి కావడం గర్వకారణమని ట్రెజరర్ డాక్టర్ కె. కృష్ణ ప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కె. శ్రీనివాస్, డైరెక్టర్ డాక్టర్ కె. రవీంద్ర, ఏవో డైరెక్టర్ డాక్టర్ ఎస్వీ శ్రీనివాస్, డాక్టర్ టి. రంగబాబు పాల్గొన్నారు.